క్లుప్తంగా

ఆలయాల్లో భక్తుల సందడి



కొనకనమిట్ల: ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. నమో వేంకటేశాయా నమోనమః అంటూ శ్రీవారికి భక్తులు భక్తి పరవశంతో నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు తిరుమలా చార్యులు లక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోవిందా.. గోవిందా అంటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను వెండి కిరీటాలతో, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు కార్తీక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వెంకట రామకృష్ణాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

లక్ష్మీ చెన్నకేశవుడికి ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవస్వామి వారికి అర్చకులు శనివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు, అర్చక బృందం ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్ర నామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు నిర్వహించారు. అలాగే రాజ్యలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలను అర్చకులు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వసించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో జీ.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

చిల్లచెట్లతో మూసుకుపోయిన దారి



రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చిల్లచెట్లు

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు నుంచి వెలుగొండ్రాయునిపల్లి బీసీ కాలనీకి వెళ్లే మట్టి రోడ్డుకు ఇరువైపుల చిల్ల చెట్లు అల్లుకపోవటంతో అటుగా వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రోజూ అటుగా వచ్చే వెలుగొండ్రాయునిపల్లి బీసీ కాలనీ వాసులతో పాటు పొలాలకు వెళ్లే రైతులకు ఇబ్బందిగా మారింది. మట్టిరోడ్డులో చెత్తా చెదారం వేయడం వలన కూడా రోడ్డు అధ్వానంగా ఉంది. అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపుల అల్లుకున్న చిల్ల చెట్లను తొలగించి రహదారి అభివృద్ధి చేయాలని బీసీ కాలనీ వాసులు కోరుతున్నారు.

స్కాట్ పితామహుడికి నివాళులు



రాబర్ట్ బాడెన్‌కు నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం చంద్రశేఖరరెడ్డి, విద్యార్థులు

మార్కాపురం టౌన్: ప్రపంచ స్కాట్స్ పితామహుడు సర్ రాబర్ట్ బాడెన్ పావెల్ జన్మదినం సందర్భంగా జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆయన చిత్రపటానికి శనివారం పూలమాలలు వేసి చంద్రయాన్ స్కాట్ ట్రూప్ ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ఎం.చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ సమాజసేవకు ఎల్లవేళలా సిద్ధంగా ఉండాలని కోరారు. స్కాట్ మాస్టర్ ఎస్‌డీ సమీ ఉల్లా బాషా భారత్ స్కాట్స్ గైడ్స్ జెండా గీతంను ఆలపించారు. ఉపాధ్యాయులు ఓవీ వీరారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శివకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వంటకార్మికుల తొలగింపు అన్యాయం

అర్ధవీడు (బేస్తవారిపేట): మండలంలోని పాపినేనిపల్లె జెడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తున్న బీసీ వంట మనుషులు ఇద్దరు, ఎస్సీ శానిటరీ ఆయాలను అక్రమంగా తొలగించారని విద్యాకమిటీ చైర్మన్ దొంతా తిరుపతి ఒక ప్రకటనలో ఖండించారు. 20 రోజుల క్రితం తహసీల్దార్, ఎంఈవో తనిఖీలో భోజనం బాగుందని కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకులను మెచ్చుకున్నారు. ఎంపీడీఓ పాఠశాలను తనిఖీ చేయలేదు. హెచ్‌ఎం, పాఠశాల విద్యాకమిటీ, విద్యార్థులు, తల్లిదండ్రులు ఎలాంటి ఫిర్యాదు కూడా చేయలేదు. ఎంఈఓ పలు మార్లు పాఠశాలను తనిఖీ చేసినప్పటికి ఎలాంటి అవకతవకలు దొరకలేదు. ఈనెల 12వ తేదీన ముగ్గురిని తొలగిస్తున్నట్లు ఎంఈవో ఉత్తర్వులు ఇచ్చారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోతే హైకోర్టును ఆశ్రయిస్తామన్నారు.

ఈ కంభానికి ఏమైంది.. !



హత్యకేసులో కాలువలో ఉన్న మృతదేహం శరీర భాగాలు ఉన్న బస్తాను పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

- కంభంలో పెరిగిపోతున్న క్రైమ్ రేటు !
- గడిచిన రెండు నెలల్లో రెండు హత్యలు
- నాలుగు నెలల్లో 10 రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృతి
- నాలుగు నెలల్లో నలుగురి బలవన్మరణం
- కనిపిస్తున్న పోలీసుల నిర్లక్ష్యం

కంభం:

జిల్లాలోనే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ క్రైం జరిగినా పశ్చిమ ప్రకాశం ఉలిక్కిపడుతోంది. గడచిన నాలుగు నెలల్లో క్రైం రేటు అమాంతం పెరిగిపోయింది. పట్టణంలో ఇటీవల వరుస రోడ్డు ప్రమాదాలు, చోరీలు, హత్యలు, బలవన్మరణాలు, దొంగతనాలు పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఈనెల 13వ తేదీన జరిగిన హత్య సంచలనం రేపగా, గతనెలలో ఓ వివాహిత హత్య జరిగింది. వీటితో పాటు గడిచిన నాలుగు నెలల్లో పలు రోడ్డు ప్రమాదాలు, బలవన్మరణాలతో పలువురు మృతి చెందారు. కంభం–జంగంగుంట్ల మధ్య హైవేపై అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. వీటితో పాటు చోరీలు జరుగుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఓ వైపు పోలీసులు రాత్రి వేళల్లో గస్తీలు, వాహనాలకు జరిమానాలు విధించడం, అవగాహన కల్పించడం చేస్తున్నా ఫలితం లేకుండా పోతుంది. కంభం పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత సైతం వేధిస్తోంది. గతంలో 12 మంది బదిలీపై వెళ్లగా వారి స్థానంలో నలుగురిని మాత్రమే వేశారు. ప్రస్తుతం స్టేషన్‌లో ఎస్సైతో పాటు ఏ ఎస్సైలు–3, కానిస్టేబుళ్లు–8, హోమ్ గార్డ్‌లు –12 మంది ఉన్నారు. ఇంకా ఐదుగురు కానిస్టేబుళ్లు, ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్ల కొరత ఉంది.

నెత్తురోడుతున్న రోడ్లు..

నవంబరు 11వ తేదీన కంభం–జంగంగుంట్ల మధ్యలో హైవే రోడ్డుపై కారు ఢీకొని కందులాపురం గ్రామానికి చెందిన చేగిరెడ్డి ఈశ్వరరెడ్డి (65) మృతి చెదాడు. నవంబరు 8వ తేదీన కందులాపురం కూడలీలో లారీపై నుంచి కింద పడి క్లీనర్ జమాల్ మృతి చెందాడు. నవంబరు 20న జంగంగుంట్ల వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని దూదేకుల సిద్ధయ్య (48) దుర్మరణం పాలయ్యాడు. నవంబరు 27న కంభం జంగంగుంట్ల మధ్య హైవేపై పంట పొలాల్లోకి కారుదూసుకెళ్లి ముగ్గురికి గాయాలయ్యాయి. డిసెంబరు 23వ తేదీన కందులాపురం కూడలీలో కారు ఢీకొని ద్విచక్రవాహనంపై వెళ్తున్న చర్చి ఫాదర్ మరియదాసు మృతి చెందాడు.జనవరి 4వ తేదీన యర్రబాలెం వద్ద మరుపెళ్లకి వెళ్లి తిరిగి వస్తున్న ఆటో బోల్తాపడి అక్కపల్లికిచెందిన దాసరి పందు మృతి చెందగా మరో 8 మందికి గాయాలయ్యాయి.



దర్గా గ్రామంలో చోరీ జరిగిన గృహంలో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్ (ఫైల్)

క్షణికావేశంలో బలవన్మరణాలు..

నవంబరు 6వ తేదీన చిన్నకంభం గ్రామానికి చెందిన కాకర్ల వీరయ్య అనే ప్రైవేటు ఉద్యోగి వాగులో దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు.

జనవరి 4వ తేదీన మండలంలోని హజరత్ గూడెం గ్రామానికి చెందిన వక్కల సుధీర్ (25) తల్లితో చిన్నపాటి గొడవ పడి క్షణికావేశంలో బలవన్మరణానికి పాల్పడ్డాడు.

ఈనెల 18వ తేదీన చిన్నకంభం పంచాయతీ పరిధిలోని దేవనగరం గ్రామంలో బిల్లా సుశ్మిత (20) పెళ్లైన మరుసటి రోజే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. దీంతో ఆకుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఈనెల 15వ తేదీన కంభం బస్టాండు సమీపంలో ఓ బేకరి వద్ద గోవిందాపురానికి చెందిన కటికల శ్యామల (35) వ్యాజ్‌మోల్ ద్రావణం తాగి ఆత్మహత్య చేసుకుంది.



బలవన్మరణానికి పాల్పడిన నవ వధువు సుశ్మిత (ఫైల్)

గొడవలు, ఘర్షణలతో బెంబేలు..

జనవరి 25వ తేదీన మండలంలోని ఎల్‌కోట జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఐదుగురు విద్యార్థులపై దాడి జరిగింది. ఈనెల 4వ తేదీన కందులాపురం కూడలీలో పానీపూరి నిర్వాహకుడికి, యువకుల మధ్య ఘర్షణ జరగడంతో ఇరువురికి గాయాలయ్యాయి. ఈనెల 18న తెలుగు వీధిలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగి ఒకరి తలకు గాయాలు కాగా మరో నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. నంద్యాల, గిద్దలూరు, మార్కాపురం, కనిగిరి ఇతర ప్రాంతాల నుంచి గంజాయి తెప్పించి చిన్న చిన్న ప్యాకెట్లు చేసి చెడు వ్యసనాలకు బానిసలైన యువతకు పలువురు విక్రయిస్తున్నట్లు సమాచారం. రావిపాడు రోడ్డు, కాలేజి రోడ్డు, వైజంక్షన్ ప్రాంతాల్లో కాలేజి, పాఠశాలు వదిలిన సమయంలో ఇంటికి వెళ్లే విద్యార్థినులను పలువురు ఈవిటీజింగ్ చేస్తున్నారు. పోలీసులు పూర్తి స్థాయిలో దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



హత్య కేసులో మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై (ఫైల్)

హత్యలతో భయాందోళనలో ప్రజలు..



జనవరి 12వ తేదీన పట్టణంలోని సాధుమియా వీధిలో అర్ధవీటి అంజలి (40) ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో హత్యకు గురికాగా పోలీసులు కేసు నమోదు చేసి భర్తను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

ఈనెల 13వ తేదీన పట్టణంలో జయప్రకాశ్ వీధిలో కదం శ్యాం ప్రసాద్ హత్య సంచలనం రేపింది. శ్యాం ప్రసాద్‌ను కుటుంబ సభ్యులు హత్య చేసి శరీర భాగాలను ఎనిమిది భాగాలు నరికి బస్తాల్లో కుక్కి కాలువలో పడేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నాలుగు రోజుల్లోనే హత్యకు కారకులైన ముగ్గురు కుటుంబ సభ్యులను, ఓ ఆటో డ్రైవర్ ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈరెండు ఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించాయి.

ఊళ్లకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం ఇవ్వాలి..




ఎస్పీ ఆదేశాల మేరకు దాతల సహకారంత ఇప్పటికే పలు చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రజలు ఊర్లకు వెళ్లే సమయంలో పోలీసులకు సమాచారం ఇస్తే గస్తీ పెడతాం. విలువైన వస్తువులు ఇండ్లలో ఉంచకుండా తీసుకెళ్తే మంచిది. ద్విచక్రవాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పిస్తున్నాం. పలు దొంగతనాల్లో రికవరీలు చేశాం.

– కే. మల్లికార్జున, సీఐ, కంభం

సైన్సు పరిశోధనలపై దృష్టి సారించాలి



సైన్సు శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ నాగరాజు, రంగయ్య



విద్యార్థులకు వినికిడి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రాంబాబు

మార్కాపురం: విద్యార్థి దశ నుంచే సైన్సు పరిశోధనలపై దృష్టి సారించాలని మార్కాపురం డీఎస్పీ నాగరాజు సూచించారు. శనివారం పట్టణంలోని వాసవీ విద్యానికేతన్‌లో సైన్సు ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యంగా రైతులకు ఉపయోగపడే అత్యాధునిక యంత్రాలు, పర్యావరణ కాలుష్యాన్ని నివారించే పరిశోధనలు చేయాలన్నారు. కళాశాల డైరెక్టర్ రంగయ్య మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేకంగా ప్రతి వారం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అంతకుముందు విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి.

డిప్యూటీ డీఈవో శామ్యూల్, ఎంఈవోలు రాందాస్‌నాయక్, శర్వాణి, హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి, వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధి గోళ్ల వరలక్ష్మి, ఆవోపా అధ్యక్షుడు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎఓ రంజిత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రాక్‌వెల్ పాఠశాలలో..

రాక్‌వెల్ స్కూల్‌లో విద్యార్థులకు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించినట్లు డైరెక్టర్ వెన్న నాగార్జునరెడ్డి తెలిపారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుకుంటారని అన్నారు.

కంటి పరీక్షలు, వినికిడి, దంత పరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు ఎం సునీత, రాంబాబు, చంద్రశేఖర్, ప్రసాద్ తదితరులు శిబిరంలో పాల్గొని పరీక్షలు నిర్వహించారు.

శ్రీశైలానికి 80 ప్రత్యేక బస్సులు



మాట్లాడుతున్న డీఎం నరసింహులు

మార్కాపురం: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మార్కాపురం ఆర్టీసీ డిపో నుంచి శ్రీశైలానికి 80 ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని డిపో మేనేజర్ ఎఎస్ నరసింహులు తెలిపారు. శనివారం డిపోలోని తన చాంబర్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఈనెల 25 నుంచి 27 వరకూ ఈ ప్రత్యేక బస్సులు తిరుగుతాయన్నారు. శివరాత్రి రోజున ప్రతి 10 నిముషాలకు మార్కాపురం నుంచి శ్రీశైలానికి బస్సులు నడిపే ఏర్పాట్లు చేశామని, 25వ తేదీన ప్రతి అరగంటకు శ్రీశైలానికి వెళ్లేందుకు బస్సులు నడుపుతున్నామన్నారు. మొదటి సారిగా మార్కాపురం చుట్టుపక్కల మండల కేంద్రాలైన తర్లుపాడు, కంభం, యర్రగొండపాలెం, త్రిపురాంతకం, మార్కాపురం రైల్వేస్టేషన్ నుంచి శ్రీశైలానికి ప్రయాణికులు వెళ్లేందుకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. త్రిపురాంతకం నుంచి స్వామివారి గుడి వరకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. త్రిపురాంతకం నుంచి శ్రీశైలానికి ప్రత్యేకంగా ఆరు బస్సులను నడుపుతున్నామని తెలిపారు. మార్కాపురం రైల్వే స్టేషన్‌లో నైట్ హాల్టు సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. ఎక్కువ మంది ప్రయాణికులు ఉంటే వారికోసం ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేస్తామని, తమను సంప్రదించాలని డీఎం తెలిపారు. సురక్షితమైన ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తూ ఆర్టీసీ అభివృద్ధికి కృషిచేయాలని నరసింహులు విజ్ఞప్తి చేశారు.

స్వాతంత్య్ర సమరయోధుడు ఉయ్యాలవాడ



మార్కాపురంలో నివాళులర్పిస్తున్న రెడ్డి సంఘం నాయకులు



తర్లుపాడులో నరసింహారెడ్డికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మార్కాపురం: స్వాతంత్ర్యంకోసం పోరాడి అందరికీ ఆదర్శప్రాయుడైన స్వాతంత్ర్య ఉద్యమ నాయకుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి మహనీయుడని రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు గుంటక సుబ్బారెడ్డి అన్నారు. శనివారం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా పట్టణ శివార్లలోని వై జంక్షన్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సంస్థ జిల్లా కన్వీనరు, కోఆప్షన్ సభ్యురాలు గుంటక వనజాక్షి, చెన్నారెడ్డి, ఎన్‌జీవో అసోషియేషన్ నాయకులు నాగేందర్‌రెడ్డి, నరసింహారెడ్డి, సర్పంచ్ గౌతమి గోపాల్‌రెడ్డి, రెడ్డి సంఘం నాయకులు కె రమణారెడ్డి, టి రామిరెడ్డి, కర్నా నరసింహారెడ్డి, వెన్న వెంకటరెడ్డి, రామిరెడ్డి, కె బలరామిరెడ్డి, ఆర్‌వి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తర్లుపాడు: ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని మండలంలోని లింగారెడ్డి కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. బ్రిటీష్ దుష్టపాలనపై తిరుగుబాటు చేసిన వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి గురించి హెచ్ ఎం మౌలాలి విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు షెక్షావలి, విద్యార్థులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ చేయించుకుంటేనే పీఎం కిసాన్



పందిళ్లపల్లిలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ తనిఖీ చేస్తున్న ఏడీఏ బాలాజీనాయక్



ఫార్మర్ రిజిస్టర్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ

కొనకనమిట్ల: ఈనెల 24న 19 విడత పీఎం కిసాన్ నిధులు విడుదల అవుతాయని ఏఓ ప్రసన్న రంగలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని వద్దిమడుగు, గార్లదిన్నె గ్రామాల్లో ఫార్మర్ రిజిష్టర్ నమోదును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఫార్మర్ రిజిస్ట్రీ' కార్యక్రమం ద్వారా రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయిస్తారన్నారు. రైతు సేవా కేంద్రాలలో రైతుల ఆధార్‌తో ఫార్మర్ రిజిష్టర్ చేసిన తరువాత ప్రభుత్వం ప్రతి రైతుకు ఒక ఐడీ నంబరు కేటాయిస్తారని తెలిపారు. భూములు ఉన్న రైతులు ఆధార్, పాసు పుస్తకం, ఆధార్‌కు లింక్ అయినా ఫోన్ నంబర్‌తో సంబంధిత గ్రామ సచివాలయాలలో సంప్రదించాలన్నారు. ఫార్మర్ రిజిస్టర్ అయిన రైతులకు ప్రభుత్వం నుంచి రాయితీలు, భూ ఆధారిత చెల్లింపులు, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా వంటి పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో వీఏఏలు సలోమి, తనూజ, రైతులు పాల్గొన్నారు.

బేస్తవారిపేట: రైతు సేవా కేంద్రాల్లో రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకుంటేనే పీఎం కిసాన్ నగదు పడతాయని గిద్దలూరు ఏడీఏ బాలాజీనాయక్ అన్నారు. శనివారం మండలంలోని పందిళ్లపల్లె, మోక్షగుండంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈనెల 24వ తేదీన పీఎం కిసాన్ నగదు రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తారన్నారు. కార్యక్రమంలో ఏవో జక్కం మెర్సీ, వీఏఏలు పాల్గొన్నారు.

రంగస్వామి ఆలయంలో బహిరంగ వేలం



బహిరంగ వేలం నిర్వహిస్తున్న రమేష్

రాచర్ల: మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన నెమలి గుండ్లరంగనాయకస్వామి దేవస్థానం సమీపంలోని లక్ష్మమ్మవనంలోని కల్యాణ మండపంలో వివిధ షాపులను నిర్వహించుకోనేందుకు శనివారం దేవస్థానం కార్యనిర్వహణాధికారి బి.రమేష్ అధ్వర్యంలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. కాఫీ, టీ, టిఫిన్ అమ్ముకునేందుకు రూ.3.50 లక్షలు, క్యాసెట్లు, స్వామి వారి ఫొటోలు అమ్ముకోనేందుకు రూ.2.95 లక్షలు, బొమ్మలు, గాజులు అమ్ముకోనేందుకు రూ.1,28 లక్షలు, కూల్‌డ్రింక్స్ అమ్ముకోనేందుకు రూ.2,50 లక్షలు, తలనీలాలు, టెంకాయలు, కొబ్బరి చిప్పలు, ఐస్‌క్రీమ్, గుండం వద్ద ఫొటోలు తీసుకునేందుకు పాటదారులు ఎవరు ఆసక్తి చూపకపోవడంతో ఈ పాటలను మార్చి 8వ తేదీన వాయిదా వేసినట్లు కార్యనిర్వహణాధికారి బి.రమేష్ తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి బి.నాగమల్లేశ్వరరాజు, దేవస్థానం అర్చకులు అన్నవరం సత్యనారాయణ చార్యులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

పెంచిన కూలీల జీవో విడుదల చేయాలి



గోడౌన్‌లో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

కంభం: హమాలీల కూలీ రేట్లు పెంచుతామని చెప్పిన ప్రభుత్వం దానికి సంబంధించిన జీవోను విడుదల చేయాలని సీఐటీయూ అన్వర్ బాషా పేర్కొన్నారు. శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో గోడౌన్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీలకు కూలీ రూ.25 నుంచి రూ. 28 పెంచారని, జీవో రాకపోవడంతో పాతరేట్ల ప్రకారమే ఇస్తున్నారన్నారన్నారు. పెరిగిన కూలీల రేట్ల, అరియర్స్ జీవోను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయని పక్షంలో పోరాటాన్ని ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో చిన్నరంగయ్య, రంగస్వామి, వెంకటంగయ్య, వెంకటమణ, రామయ్య, గురవయ్య, కార్మికులు పాల్గొన్నారు.

తాత్కాలిక గోశాలలో రెండు గోవుల మృతి



తాత్కాలిక గోశాలలో ఉన్న గోవులు

మార్కాపురం టౌన్: పట్టణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక గోశాలలో గత నాలుగు రోజుల వ్యవధిలో రెండు ఆవులు వివిధ కారణాలతో మృతి చెందాయి. దీంతో గోప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ తరచూ రోడ్డు ప్రమాదాలకు గురవుతూ రక్తస్రావమై రోడ్డు వెంట తిరుగుతున్న ఆవులను కాపాడేందుకు మున్సిపల్ సిబ్బంది తాత్కాలికంగా గోశాల ఏర్పాటు చేశారు. వివిధ కారణాలతో 2 గోవులు మృతి చెందాయి. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ నారయణరావును వివరణ కోరగా గోశాలలో అనారోగ్య కారణాలతో రెండు ఆవులు మృతి చెందాయి. మిగతా వాటిని రక్షించేందుకు పశువైద్యులతో చికిత్స చేయిస్తున్నామని చెప్పారు.

జాబ్‌మేళాలో 131 మంది ఎంపిక



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు

కంభం: కంభం స్కిల్‌హబ్‌లో నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని ఏపీఎస్ఎస్‌డీసీ డీఎస్‌డీఓ జే. రవితేజ యాదవ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన జాబ్ మేళాలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులు, యువకులు జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు పొందాలన్నారు. స్కిల్ హబ్ ఆధ్వర్యంలో నైపుణ్యత పెంపొందించడంతో పాటు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగవకాశాలు కల్పిస్తారన్నారు. 229 మంది నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ చేసుకోగా 131 మంది ఉద్యోగవకాశాలు పొందగా, 15 మంది షార్ట్‌లిస్ట్ అయినట్లు నిర్వాహకులు తెలిపారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోపూజ

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివార్లలోని జంకె రామిరెడ్డి కాలనీలో ఉన్న కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం 18వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం 16రోజుల పండుగను పురస్కరించుకుని స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళా భక్తులు గోపూజ చేశారు. ఆలయ అధ్యక్ష కార్యదర్శులు నరసింహారావు, రామకృష్ణ, పాల్గొన్నారు.